



కథానిక

మంజుశ్రీ

శేషశాస్త్రి చచ్చిన పన్నెండో రోజున కాకులు అన్నం ముట్టలేదు. రంగమ్మ లబలబలాడింది. పెద్దకొడుకు అయిష్టంగానే వచ్చి దండం పెట్టుకున్నాడు. కాని కాకులు చూస్తుచూస్తూనే నిలుచుండి పోయినై. "చచ్చి కూడా సాధిస్తున్నాడు పాడు ముండాకొడుకు" అన్నది సోదెమ్మ. కామాక్షి గుండెల్లో కణకణ మండే ఎర్రటికొరివితో కెలికినట్లనిపించింది. రంగమ్మపోయి రెండో కొడుకుని కూడా రమ్మని బ్రతిమిలాడింది. అతడు ససేమిరా, రానన్నాడు. కామాక్షి "నాన్నా! ఏమిటా నీ హృదయంలో బాధ" అని మూలిగింది. రంగమ్మ కేమిటీ తోచలేదు.

పురోహితుడు రెండో కొడుకును బ్రతిమిలాడుకున్న తర్వాత వచ్చి లోలోపల తిట్టుకుంటూ దండం పెట్టుకున్నాడు. కాకు లసలు వాసనకూడా చూడలేదు. రంగమ్మగారన్నది పెద్దకొడుకుతో "ఓరే సుబ్బరాయిడూ! కామాక్షి పెళ్ళి నేను చేస్తాను. నువ్వేం బెంగ పెట్టుకొనవసరం లేదు నాన్నా! శాంతంగా రావలసింది" అని చెప్పరానాయనా అని చెప్పింది. సోదెమ్మ బుగ్గలు నొక్కుకుంటూ "తగుదునమ్మా అని చెప్పొచ్చావుటమ్మా! మాకేం గరజుపట్టింది? అతగాడిచేత అనిపించరాదూ ఆ మాటలు?" అంది మరిదినిఉద్దేశించి.మరదలుకు,తోటికోడలికీ మాటలు వినపడ్డాలని, వారిని బాగా వ్యాఘాతపరచాలనీ ఆమె ఉద్దేశం. అందుకే అంత పెద్దగా అన్నది.

కామాక్షి కళ్ళు వాచేలాగా ఏడుస్తోంది. రంగమ్మ పెద్దకొడుకును ప్రాధేయపూర్వకంగాఅడిగిందిమళ్ళా. సోదెమ్మ యిందాకటికంటే కటువుగా సమాధానం చెప్పింది. అన్నవాడు అతగాడూనూ చేయవాలసినవాళ్ళం మేమూనా, అంది. తోటికోడలుకు వినపడాలని. ఎవరో పరామర్శిస్తుంటే, పెద్దకోడలి మాటల్ని తోటికోడలు మొదటిసారి అంతగా పట్టించుకోలేదుగాని, రెండోసారి తొక్కతొక్కిన తాచైంది. "ఎవడేతిన్నది? నీ అబ్బగాడు తిన్నాడేమో, నువ్వు తిన్నావు, నీ అబ్బ తిన్నాడు" అని లేచింది. సోదెమ్మ పెద్దగా యేడుస్తూ నడుమ నడుమ తోటికోడలి అటు ఏడుతరాలవాళ్ళని యిటు ఏడుతరాలవాళ్ళని దుయ్యపడుతూ, రసాభాస సాగించింది. రంగమ్మ కుప్పకూలిపోయింది.

కామాక్షి తల్లిని పట్టుకుని కూచుని యేడుపు సాగించింది.

పురోహితుడు రెండోకొడుకుదగ్గరకు వచ్చి అడిగాడు. ఏమయ్యా "అమ్మాయి పెళ్ళి చేస్తాను,దిగులుపెట్టుకోకు అని చెప్పరాదటయ్యా" అన్నాడు. రెండోకొడుకు అన్నాడు "మా నాన్నకు నాగురించి అటువంటి ఆశలేమీవుండవు. అస లనుకోడు కూడా. అయినా అంత బాధ్యత నా నెత్తిన వేసుకోదలచుకో లేదు. నా కూతురి పెళ్ళిచేస్తే ధన్యుణ్ణే రెండేళ్ళయి పెద్దమనిషి ఇంట్లో కూచున్న దానికి నే నెట్లా పెళ్ళిచేయగలను" నా వల్లగాదు అన్నాడు.

పురోహితుడు ముక్కుమీద వేలేసుకొని లోపల్లోలనే ఛా! అన్నాడు.

పూళ్ళో యీ సంగతి తెలిసి శేషశాస్త్రి పూరిపాకవద్ద జనం పోగయ్యారు, తలో వొకమాట అనుకుంటూ,

కరణాన్నుద్దేశించి "సుబ్బాయుడికి నువ్వన్నా చెప్పు నాయనా" అంది

రంగమ్మ. కర్ర పొడిచి కరణం ముందుకొచ్చాడు.

చూడు సుబ్రాయుడూ! ఎట్లాయినా కన్న వాడు తండ్రి. తల్లిదండ్రులు దైవసమానులు. చూడూ. నేను పెద్దవాణ్ణి. చెపుతున్నాను విను, "తల్లిదండ్రులమీద దయలేని పుత్రుండు, పుట్టనేమి వాడు గిట్టనేమి, పుట్టలోన చెదలు పుట్టవాగిట్టవా?" కాబట్టి ఎట్లాగు బ్రతికిన నాలుగునాళ్ళూ కష్టపడి పోయాడు పుణ్యాత్ముడు. ఇవాళ కాస్త ఆయన మనసు శాంతిపరచు. చూడు నీకా పిల్లల్లేరు. అమ్మాయి పెళ్ళిచేస్తాననలేవా? మేమంతా లేమూ? నువ్వొక్కడవే భారాన్నంతా అనుభవించాల్సిన పనిలేదు" అను నాయనా అన్నాడు కరణం.

కరణంగారు సుబ్రాయుడుకి సలహానివ్వటం గమనించి, ఎగసుపార్టీ నాయకుడైన మున్సబు అయాచితంగా రెండోకొడుక్కి సలహానివ్వటాని కొచ్చాడు.

కరణంగారు "సుబ్రాయుడు త్వరగా తనమాట విని. పిల్ల పెళ్ళిచేస్తానని దండం పెట్టుకుంటే తన మాట నెగ్గుతుంది తను పరిష్కరించినవాడవుతాడు" అని తొందరచేయటం మొదలెట్టారు.

అవతల మున్సబుకూడా అంతే.

సుబ్రాయుడు వొప్పుకుంటాడేమోనన్న భయంతోటి సోదెమ్మముందుకొచ్చి కరణంగారితో మాట్లాడటం మొదలెట్టింది.

రంగమ్మ యిద్దరికొడుకులూ వినకపోవటం చూసి, గుండెలు పగలగొట్టుకుంటున్నది. కామాక్షి తల్లినిచూసి విలపిస్తున్నది.

కరణమూ, మున్సబూ, యింకా యితర పెద్ద మనుషులూ, ఎవరికితోచిన సలహాలు వాళ్ళు యిస్తూనే వున్నారు.

రెండోకొడుకులేచి చెప్పటం మొదలెట్టాడు. మున్సబు విజయిగర్వంతో చుట్టూరా కలయ చూశాడు. చాటుగా మీసంకూడా దువ్వుకున్నాడు. సోదెమ్మ ఆత్రపడింది. గౌరవం అతగాడికి దక్కుతుందేమోననీ, యిందాకనే యీయన్ను పంపిస్తేనే బాగుండేదని అనుకోవటం మొదలెట్టింది. కానీ వొకపక్క సోదెమ్మ సంతోషాన్ని అనుభవిస్తున్నది. అతగాడికి గరుజు వదలాలసిందే, వదలకపోతే లాభంలేదు. అయినా ఏమిటా ధైర్యం. పదేళ్ళ పాడుముండ పెళ్ళికెదిగివుంటే. ఏమని ఆ పాడుమొహం పిల్లపెళ్ళి చేస్తుందిలే. తోటికోడలు—ఇదీ సోదెమ్మ సంతోషం.

రంగమ్మ రెండోకోడలికి నిజంగా ఆయనమీదే సుకుంటాడేమోనని భయం. మళ్ళీ యీ మాట అంటే ఏంపోయింది? తరువాత చెయ్యకపోతే పాడుముండాకొడుకు పీక నులువుతాడా ఏం? ఇప్పుడుమాత్రం తమ గొప్పతనం లోకానికి వెల్లడవుతుంది. సోదెమ్మనోట్లో నలుగురూ వుమ్మేస్తారు. ఛడవముండ! అంతే. కావలసిందేలే అనుకుంది.

రెండోకొడుకు మున్సబు దరస్మితవదనుడై వినుచుండగా యిట్లా మొదలెట్టాడు. కరణం మొహం నల్లపడి మాడిపోయింది. రంగమ్మ లేని సత్తువ తెచ్చుకుంది. కామాక్షి చిన్నన్నయ్య మంచి వాడేమోలే అని తలెత్తిచూడటం మొదలెట్టింది.

"అయ్యా, మా తండ్రిసంగతి మీ అందరికీ తెలుసు. అయినా మా కుటుంబ వ్యవహారమంతా మీకు మనవి చేస్తున్నాను. మానాన్న యాయవారబ్రాహ్మణుడనే సంగతి మీకు తెలుసుగదా. ఆయన తండ్రి అంటే మా తాత శ్రీ శేషయ్య శాస్త్రిగారు, కవిపంచాననులని పేరుపొంది అగ్రహారాలే పొందారు. సన్మానాలు బడశారు. కాని మహా రసికాగ్రేసరుడై అంటే ముండల ముఠాకోరై మా నాన్నగారికి చెంబిచ్చాడు. మా నాన్న మంచివాడు కాడని అంటంలేదు. కాని కొడుకులకు ఆయన సరైన న్యాయం చేయలేక పోయాడు. అందరికీ సమానంగా చదువు చెప్పించలేదు. మరీ నన్ను చాలా అన్యాయంచేశాడని మీకందరికీ తెలిసిందే. మున్సబు 'నిజం నిజం పాపం పిచ్చిబొమ్మడు ఏంతెలీదు' అన్నాడు. రెండో కొడుక్కు వుత్సాహం మొచ్చింది. మళ్ళీ చెప్పటం మొదలెట్టాను— "నన్నన్యాయం చేసిన మాట వాస్తవం. పెద్దవాడికి వేదం చెప్పించి పౌరోహిత్యం నేర్పాడుకదా, నేను స్కూలుఫైనలు తప్పితే రెండోసారి చదివించటానికి యిష్టపడలేదు. వాడికేం, వేరుపడ్డప్పటి నుంచీ మహారాజుగా నాలుగెకరాలు సంపాదించుకున్నాడు. నేనో దరిద్రంతో యేడుస్తున్నాను. నాకు పెండ్లికెదిగిన పిల్లకూడా వుండె, వాడికి పిల్లా పాపా ఎవరూ లేకపోయినా, ఒక్కరోజున

మా తండ్రిని ఆదరించాడేమో చూడండి. డబ్బు లేనివాడా? అదికాదే." ఈ సమయంలో సోదెమ్మకు వుక్రోషంవచ్చింది. అలా ముంగిలా నిలబడతారేమిటండీ, మీకు నోరులేదుటండీ, నోరు పడిపోయిందా, నోరులేనివాణ్ణిచేసి లోకులంతా యేడిపిస్తున్నారు. ఖర్మ! చేసుకున్నదానికి చేసుకున్నంత మహాదేవ! రాత. ఎవరినంటే ఏంలాభం? ఏమంటే ఏమొస్తుంది, అని ఎత్తుకుంది. సుబ్బరాయుడు ఏం మాట్లాడలేదు. సోదెమ్మ యేడుస్తూ యింట్లోకి పోయింది, రెండో కొడుకు యింకా చెప్పుక పోతూనేవున్నాడు— "చనిపోయిన మా నాయనగారు తన కొడుకులను చదువుల విషయంలోకూడా అన్యాయంచేశాడు. మా అమ్మ, పెద్దకోడలుకంతా దోచియిచ్చింది. ఆమెకా విశ్వాసమన్నా లేదు. మా అమ్మ మెళ్లోనానుపట్టెడ ఏమైంది, నిష్ట దరిద్రుడైనా, యాయవారంచేసుకునే బ్రాహ్మడైనా వున్న రెండెకరాలూ అమ్ముకతినకపోగా, ఐదారెకరాలదాకా సంపాదించి, యిల్లుకట్టించుకొని, పెద్దకొడుక్కి ఆ యిల్లు సమర్పించి, గుడిశెవేసుకొని, చివరకు దాంట్లోనే చచ్చాడు. వాడంటే పడిచచ్చేవాడు. దగ్గరైనా లేకుండానే చచ్చాడు. చివరకు ఆయన చచ్చిపోయే రోజుకైనా ఆయన వీధిలోకిపోతే రెండుసార్లు చెంబునింపుకొని వచ్చేవాడు. అవన్నీ ఖర్చయేవి కావు పెద్దకొడుకింటికీ, మూడోకొడుకింటికీ పోతుండేవి. మూడోకోడలికి ఎవరున్నారు? మా తమ్ముడు యేడాదిలోనే చచ్చాడుకదా, ఆమె మా యిద్దరిలో ఎవరిదగ్గరనో వుండగూడదూ? లేక పుట్టింటికి పోగూడదా? ఈ వూళ్ళోనేవుండి యింత చెడుపేరు తెచ్చుకోవటం దేనికీ? చనిపోయిన మా తమ్ముణ్ణిప్పుడు నలుగుర్లోకి తేవటం భావ్యంకాదుకాని, అయినా మా యింటివ్యవహారమంతా చెబితేగాని, న్యాయాన్యాయాలు ఎవరివైపున్నవీ తెలుసుకోలేరు మా తమ్ముడికి మాత్రం యీయన కాలేజీ చదువు చెప్పించలేదా. వాడికాయుస్సులేకనో, పెళ్ళాం దయవల్లనో, ఆవిడ కాపరానికి రాకుండానే చచ్చాడు కదా. వాడుంటే యిన్నికష్టాలు రాకపోయేవి. అవతల వాకిలిదగ్గర వోరగా నిల్చున్న మహాలక్ష్మి (శేషశాస్త్రి మూడోకోడలు) కళ్ళనీళ్ళు గ్రుక్కుకుంది. వాడికి నేనంటే ఎంతప్రాణం, పెద్దవాటంటే వాడికీ సరిపడేది గాదులే. ఈవిడను నేను పోషించనన్నానా. వేర్లుపడేనాడు, మూడోకోడలికి రెండెకరాల పొలం, వో చిన్న పూరిల్లు రాసియ్యటం దేనికి. ఇటువంటి అవకతవక పనులు చేసినందువల్లనే ఆయనకూ మాకూ అసలు పడకుండా వచ్చింది. పుట్టింటికి పంపించి భరణమిస్తుంటే సరిపోయేదిగాదూ! పైన ఆవిడ ఈ వూళ్ళెవుంటేవుండి తనకుతనన్నవాడెవడూ లేడుగదా, వేరుగావుండటం దేనికి. పోనీ నాయన్నవాళ్లంటుండే యింట్లోనే వుండొచ్చు. ఈసమయంలో రంగమ్మగారుతలబాదుకొని అది నాఖర్మరానాయనా అంది. రెండోవాడు చెప్పకపోతున్నాడు. "పోనీ ఆవిడ యీవూళ్ళో వుంటే వున్నదిలే, అనుకుందామా? మా పరువు ఎంతగా మంటకలసిపోయింది. ఆమె చెడునడవడి వూరంతకీ తెలిసిందేకదా." మహాలక్ష్మి పైట చెరగుతో మొహం కప్పుకొని యేడవటం మొదలెట్టింది. అప్పటికీ మాయింటి కొస్తామంటే కాదనలేదు. పైన వూరంతా యిలా అనుకుంటున్నా, మానాయన వూళ్ళో అందరికీ ఆవిడ నిప్పులాటి మనిషని ప్రచారం చేస్తుండేవాడు. ఆయన్ను ఏమనాలి. ఏమనుకుంటే ఏంలాభంలే, మనిషలాంటి వాడు. ఎన్ని అవకతవకలు జరిగినా నేను ఆయన కొడుకును కాబట్టి (రంగమ్మగారు నిట్టూర్పు విడిచింది) ఆయన ఆత్మశాంతి పొందేటట్లు చేయటం నావిద్యుక్త ధర్మం, కాని నేనెంత బీదవాణ్ణో మీకందరికీ తెలిసిందే. పైన నాకూ పెండ్లీడుకొచ్చిన కూతురున్నది. నేను ఎట్లా రెండు పెళ్ళిళ్ళు చేయగలనూ? ఊరిపెద్దలు చెబుతున్నారు కాబట్టి. ఊరివాళ్ళు సాయంగావుంటే యీ మాత్రం నే చేయగలను."

"ఓ, దానికేం, లక్షణంగా జరిపించనూ, రేపీపాటికి పెండ్లి మీ నాయనమీద మాకున్న గౌరవ మాలాంటిది. ధరమాత్ముడు. కంఠమెంత శ్రావ్యంగా వుండేది. అలవైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబులో అని భాగవతం పాటగా ఎత్తుకుంటే ముగ్ధులై పోవద్దూ? ఎవరైనా కదిలేవాడా. ఛప్ ఆట్టాయిన వల్సిందే. అధ్యాత్మ కీర్తనలు కాని, రుక్మిణీ కళ్యాణంకాని, గజేంద్ర మోక్షంకాని, భారతంకాని, ఎంతబాగ పాడేవాడు. బాగా చదువుకున్నవాడులే. పుణ్యా

త్ముడు. నీకెందుకు నువ్వు అను. మీ నాయన మనసు శాంతిస్తుందా? కాకులు ముట్టుకుంటాయి. మేమంతా మనుసులుగామటయ్యా, సాయం మేంటి బ్రాహ్మడికి చేసిన పుణ్యామేడకిపోతది. కానీ కానీ కాళ్ళకడుక్కోని దండం పెట్టుకో" అన్నాడు మున్సబు.

సోదెమ్మ మొహంలో కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు. ఆ గౌరవంతా పొందలేక పోయామే అనీ, మున్సబు సాయం తమకు లభించక పోయెనే అనీ, యీ అసరా చూసుకొని మరిది తన కూతురి కెక్కడ పెళ్ళిచేసేస్తాడో అనీ ఆవిడ భయం.

కరణం తన మాట చెల్లుబడి కాకపోయెనే అని చాలా సంతాపపడి దిగాలుపడి కూచున్నాడు.

మున్సబు పార్టీలోని పెద్దమనుషులు కామాక్షి పెళ్ళికి తాము సాయంజేస్తామని వొక్కొక్కరే ముందుకొచ్చి చెబుతుంటే సోదెమ్మ వొంటికి కారం పూస్తున్నట్టుగా బాధపడింది.

ఒక్కొక్కరేవచ్చి అంతా తాము సాయం జేస్తామని మాట యిచ్చారు. రంగమ్మ రెండో కోడలికి చాలా సంతోష మనిపించింది. అసరా చూసుకొని ముందు తమ పిల్లపెళ్ళి చేసుకోవచ్చు, తరువాత కాస్తో కూస్తో మిగుల్చుకొని ఎలాగోలాగ కామాక్షి పెళ్ళి చెయ్యొచ్చుననే సంగతి ఆమెకో వూహా మెరిసింది.

రెండో కొడుకు తానేసుకున్న పన్నాగం పారి నందుకు చాలా సంతోషించాడు. వెంటనే భావి దగ్గరకెళ్ళి మూడు బుక్కెనలు స్నానంచేసి పొడి గుడ్డ కట్టుకొని వచ్చాడు.

పురోహితుడు ఏవేవో మంత్రాలు చదివాడు. శేషశాస్త్రి రెండోకొడుకు చేతులు జోడించి నిల బడ్డాడు. రంగమ్మవచ్చి దగ్గర నిలబడి యిట్లా చెప్పటం మొదలెట్టింది. "నాన్నా నువ్వేమీ దిగులు పెట్టుకోవద్దు. ఇన్నాళ్ళనుంచీ నిన్ను కష్టపెట్టినందుకు విచారిస్తున్నాను. ఇకముందు అట్లా వుండను. 'కామాక్షి'కి మంచి సంబంధం చూసి పెళ్ళిచేసే బాధ్యత నామీద వేసుకుంటు న్నాను. అమ్మను బ్రతికినన్నాళ్ళూ కష్టపెట్టను." రెండోకొడుకు తు. చ. తప్పకుండా యీ మాట లన్నీ అని చేతులు జోడించి రెండుసార్లు నమ స్కారం చేశాడు.

మున్సబు విజయగర్వంతో కరణంవైపు చూశాడు. కాకులు దగ్గరదగ్గరకొచ్చి వెళ్ళి పోయినై. రంగమ్మ హృదయం బ్రద్దలైంది. కామాక్షి తనమూలంగానేగదా యీ కష్టాలన్నీ అని వెక్కివెక్కి యేడ్చింది.

పురోహితుడు చెప్పాడు. శేషశాస్త్రిగారి వాంఛ నిశ్శేషంగా తీరిపోలేదు. ఇంకా ఎక్కడో అక్కడ కాస్త అనుమానం పట్టి బాధిస్తున్నది. అందుకనే కాకులు ముట్టటంలేదు. పెద్దకొడుకు నొచ్చి దండంపెట్టుకోమనండి అన్నాడు.

మున్సబు శేషశాస్త్రిమీద అంతరంగంలో ఆగ్రహోదగ్రుడై పోయాడు. మున్సబు పార్టీలోని పెద్దమనుషులందరికీ తలలుకొట్టేసినట్లయింది.

రంగమ్మ రెండోకొడుకు చచ్చాడులే భడవ ముండాకొడుకు, మాకేం పోయింది లేదులే అన్నాడు. రెండో కోడలు కూడా తిట్టుకుంది.

కరణం మొహం వెలిగిపోయింది. ఠీవిగా లేచి నిలుచొని కర్రపొడిచి, "ఎట్లాఅయినా పెద్దకొడు కొతాడా చిన్నకొడుకు, పెద్దకొడుకు బాధ్యతలు వేరు, తండ్రికి పెద్దకొడుకుమీద వుండే ప్రేమ కూడా వేరే. దేనికదే. పెద్దకొడుకంటే తండ్రికి ప్రాణం. మాటామాటా అనుకున్నా, ఆయన తండ్రి కాకనూపోడు, ఇతడు పెద్దకొడుకూ కాక పోడు. అయినా నాకు తెలుసు, శేషశాస్త్రిగారికి సుబ్బారాయుడంటే ఎంత ప్రాణమో. పదేళ్ళ వచ్చిందాకా సుబ్బారాయుడు వాళ్ళ నాన్న వొళ్ళోనే వుండేవాడు. ఆయనకు తగని మాలిమి. ఎట్లాయినా బాధ్యతలు తనసెత్తిన వేసికొనవలసిన వాడు. కాబట్టి నామాట విని సుబ్బారాయుడు వచ్చి దండంపెట్టుకుంటే, ఆయన మనసులోనివన్నీ తీరిపోయి శాంతిపడుతాడు"అన్నారు కరణంగారు.

చుట్టుపక్కల కూచున్న కరణంగారి పార్టీ లోని వాళ్ళు నిజం, నిజం అన్నారు. కరణంగారు పొంగిపోయాడు. భగవంతుడనేవాడు తనవైపు వుండబట్టి ఈ గౌరవం పొందడంనుండి మున్సబు వంచింపబడ్డాడు. ఆయనకు మితానందం అదే.

అయినా తప్పతుందావిషి, వెళ్ళండి, తిన్నది అతగాడూనూ, చేయాల్సింది మనమూ నూ,

వెళ్ళండి, ఏంతప్పౌతుంది, అన్నది సోదెమ్మ బుగ్గలు సొట్టలుపడేలా నొక్కుకుంటూ.

కరణంగారి పార్టీలోని వాళ్ళందరూ వెళ్ళండి సుబ్బారాయుడుగారూ అన్నారు.

సుబ్బారాయుడు గాయత్రిని స్మరించుకుంటూ స్నానంచేసి, జుట్టుముడి వీపుమీద పడేట్టు వదిలేసి పొడిపట్టలు కట్టుకొనివచ్చి నిలబడ్డాడు. చేతులు జోడించాడు.

ఇంతలోకే సోదెమ్మ ఆత్రపడుతూ పరుగెత్తుకుంటూవచ్చి, మీకేమన్నా మతిగాని పోయిందా ఏమిషి? అతగాడు అడిగినట్లు మీరూ అడగండి, లేకపోతే ఆ పీనుగను ఎవరు మెడ కట్టుకుంటారు బాబూ, ఇప్పటికే బెప్పెలు కట్టుపోయినై. అడగండి. కరణంగారినీ, ఊరివారినీ సాయం అడకండి. అట్లా అయితేనే దండంపెట్టుకొండి అన్నది.

సుబ్బారాయుడు భార్య సమయస్ఫూర్తికీ తెలివితేటలకీ అబ్బురపడి, నాకు నిజంగా తట్టలేదు చెప్మా,! అని ఆలోచించి, నలుగురు ముందుకొచ్చి, లోపల సోదెమ్మను అభినందించి. ఉపోద్ఘాతం మొదలెట్టాడు.

"నేనుమాత్రం డబ్బున్నవాణ్ణా యేంటి. ఏదో గుట్టుగా బ్రతుకుతున్నాను. పిల్లలు జెల్లలు లేకపోతే మాత్రం వున్నన్నినాళ్ళు బ్రతకొద్దా. ఏమో! పుడతారేమో. ఎందుకు పుట్టగూడదు. ఒక ఆడపిల్లో మొగపిల్లాడో పుడితే వాళ్ళ గతేంకాను? ఈ సమయంలో సోదెమ్మ ముసిముసినవ్వులు నవ్వుకుంది. కామాక్షికి పెళ్ళి చెయ్యటం నేనొక్కణ్ణే భరించగలుగుదునా. బీదవాణ్ణి తండ్రిమనసు శాంతింప జేసే భారం నామీద వుంటేమాత్రం ఏం చేయగలను?

సుబ్బారాయుడు ఎక్కువ ఉపోద్ఘాతం చెప్పాల్సిన పనిలేక పోయింది. కరణంగారందుకొని మేం లేమూ? అన్నారు.

కరణంగారి గ్రూపుకొని పెద్దమనుషులందరు తలో కాస్త కాస్త తాము సాయంచేస్తామని మాట ఇచ్చారు.

సోదెమ్మకు బ్రహ్మరథం పట్టనంత ఆనందమొచ్చింది. రెండో కోడలు మొఖం చిట్లించుకొని నిలబడ్డది. రంగమ్మా, కామాక్షీ ఆశను కాస్త రగిలించుకుంటున్నారు.

సుబ్బారాయుడు చేతులు జోడించి దండం పెట్టి "నాన్నా నువ్వు అశాంతి పెట్టుకోకు. కాముడు పెళ్ళి నేను చేస్తాను. అమ్మను సరిగా చూస్తాను. ఏం దిగులు పెట్టుకోకుండా వుండవలసింది, మనసు శాంతిపరచుకోవాల్సింది" అన్నాడు

సోదెమ్మ ఆత్రంగా చూసింది. కాకులసలు వాటి ఛాయలకైనా పోలేదు. పురోహితుడు 'యింకా' అనుమానం తీరలేదండీ' అన్నాడు. కరణంగారి కేమిచెప్పటానికీ పాలుపోవటంలేదు. కామాక్షి రంగమ్మా కూలిపోయారు. రెండో కొడుకోడలు సంతోషించింది. అక్కడున్న మనుషులకేం అర్థంకాలేదు.

రంగమ్మ దండం పెట్టుకుంది ఏడుస్తూ. కామాక్షికి దిక్కుదరీ తోచలేదు.

మహాలక్ష్మి కళ్ళనీళ్ళు తుడుచుకొని ముందుకొచ్చింది. చేతులు జోడించి "మామగారూ! అశాంతి పడకండి. నా పొలమూ యిల్లూ అమ్మైనా సరే, ఎవరూ సాయం చెయ్యకపోయినా సరే, కామాక్షి పెళ్ళి నే చేస్తాను" అన్నది.

కాకులొచ్చి అన్నాని ముట్టుకొని ఆరగించటం ప్రారంభించినవి. శేషశాస్త్రి శేషవాంఛ నిశ్శేషమై పోయింది. అక్కడనున్న జనమంతా ముక్కుమీద వేలేసుకున్నారు. సోదెమ్మా, సుబ్బారాయుడూ, రెండో కొడుకూ రెండో కోడలూ దిగాలుపడ్డారు.

రంగమ్మ మాటాడలేదు. చిన్నొదినా అంటూ కామాక్షిపోయి మహాలక్ష్మిని కౌగలించుకుంది. మహాలక్ష్మి కామాక్షివొళ్ళు నిమిరింది.

---

తెలివిలేనివాడిలో ఎన్ని లోపాలుంటాయో, ప్రజ్ఞావంతుడిలోనూ అన్ని లోపాలూ ఉంటాయి; ఎటొచ్చి బుద్ధిహీనుడి లోపాలు వాడికి తప్ప ప్రపంచానికంతటికీ తెలిసిపోతాయి; ప్రజ్ఞావంతుడి లోపాలు వాడికి తప్ప ప్రపంచానికి అసలు తెలియవు.—కోల్టన్.